# డ్రైవరు గురయ్య

పరుగెత్తే రైలు బండ్లను చూసారు కదూ!

పసుపు, ఎరుపు ఆకుపచ్చ రంగు దీపాలు, వంకర టింకర లైన్లు, పెద్దపెద్ద ఇంజన్లు, బండిని పోనిచ్చేందుకు వాలే రెక్కలు, ఈకూతలు, యీలల గందర గోళమంతా గజిబిజిగా వున్నా చాలా తమాషాగా వుంటాయి. మన శరీరంలోని రక్త నాళాల్లోనుంచి చురుకుగా నెత్తురు ఎంత వేగంగా పరుగెడుతుందో అల్లానే దేశంలోని రైల్వే లైనుల గుండా సరుకులు, మనుష్యులు ఒక చోటునుంచి మరొక చోటుకు పోతూంటారు.

పరుగెత్తే రైలు బండ్లను గురించి రెండు ముఖ్య విషయాలున్నాయి.

సరుకులు నష్టం కాకుండా చురుగ్గా దేశంలోని అన్ని చోట్లకు చేరటం.

మనుష్యులు ప్రయాణం చేస్తున్నప్పుడు ఏపాటి స్వల్ప ప్రమాదంకూడా జరగకుండా చూట్టం.

ప్రమాదాలు జరగకుండా ఎంతశ్రద్ధ తీసుక్కొన్నప్పటికీ ఒకప్పుడు ఘోరమైన తప్పిదాలు పొరబాట్లవల్ల పెద్దపెద్ద రైలు ప్రమాదాలు జరగటం, ఆస్తులు, మనుష్యులు నష్టపోవటం మీరు పత్రికల్లో అప్పుడప్పుడు చదివే వుంటారు.

ఓ మారు ఏం జరిగిందంటే—

మద్రాసు మెయిలు కలకత్తా వైపునుంచి శరవేగముతో వస్తున్నది. మెయిలంటే సామాన్యమా?

ఆడవాళ్లూ, పిల్లలు, వేలకొద్ది ప్రయాణం చేసేవాళ్లూ, పెద్దపెద్ద ఉద్యోగులూ, మంత్రులూ—గొప్పవాళ్ళనేకమంది ప్రయాణం చేస్తూ వుంటారు. కాని వాళ్ళను క్షేమంగా వారివారి చోట్లకు దిగబెట్టటం ఎంతో మెలుకువ, శక్తి సామర్థ్యాలతో కూడుకొన్నపని. అన్ని వేల మంది ప్రాణాలు డ్రైవరు గురయ్య గుప్పిట్లో ఉంటాయని చెబితే నమ్మలేం కదూ?

ఈ మెయిలు డ్రైవరు గురయ్య చదువుకోలేదు. బండి నడపటానికి మంచిదిట్టమైన మనస్సూ, రాయిలాంటి గుండె కావాలి. నిసానీదారు గురయ్య, వెయ్యి రూపాయల జీతం తీసుకునే గురయ్యను గనక మీరు చూస్తే—

అబ్బే; ఇదేఁవిటీ మనిషి అని నాలుక చప్పరిస్తారు.

చింపిరి బుర్లూ, నీలి చొక్కా నీలి లాగూ, బండ బూట్లూ నోట్లో లంక పుగాకు చుట్టా — కోపంవస్తే మరి బండ బూతులే నోటంట వచ్చేవి. అతను ఇంజను బోర్డుమీద నిలబడితే పాలాక్షుడ్నికూడా లెక్క

చెయ్యడు. ఇక అతని లాగూ బెల్టుకి ఓ జేబు గడియారం సదా వ్రేలాడు తూంటుంది. అంతా నిమిషాలు సెకన్ల దగ్గర్నుంచీ లెక్క. అతను రైలింజన్ని ప్రాణంగా చూసుకుంటాడు. దానికి కావల్సిన బొగ్గును చక్కగా చిన్న చిన్న ముక్కలుగా కొట్టివేయించుకుంటాడు. కావలసిన నీళ్ళను భద్రంగానింపుకుని ముందే జాగ్రత్త పడ్తాడు. చక్రాల్లో చమురు తన చేతుల్తో పోసుకుని, ఓ మారు అన్ని పరీక్షలూ చూసి తృప్తి పడ్డాకగాని బండిని వదలడు. బండి రొప్పిందన్నా, ఆవిరి బలం తగ్గిందన్నా గురయ్య గిలగిల్లాడి పోతాడు. చాలా ముఖ్యమైన సంగతేఁవిటంటే "వాక్యూమ్" (శూన్యం) బ్రేకుల్లాగానే బండి ఎంత వేగంలో ఉన్నా ఠక్కున నిలిచిపోవాలి. వాక్యూమ్ పేచీ పెట్టిందా ఇన్ని వేల ప్రాణాలు హరోహరి కావల్సిందే.

రెండు స్టేషన్లమధ్య — వొకే రైలు మార్గంగుండా ఎప్పుడైనా ఒకబండి పోవటానికి మాత్రమే అనుమతి వుంటుంది. లైను ఖాళీ అని అధికారులు బండిపోవటానికి అనుమతి యిచ్చాకే ఏ రైలుబండిగాని ఒక స్టేషను వదలి రెండవ స్టేషనువైపు పరుగెడుతుంది. పొరబాటున రెండు వైపులనుంచీ కూడా అటోరైలు ఇటోరైలూఎదురెదురుగా ఒకే లైనుమీద వదలబడ్డాయో...ఫలితం.... ఘోర ప్రమాదం.... రైల్వేసిబ్బంది యావత్తూ అరెస్టు కావటం జరిగి తీరుతుంది.

ఇట్లాటిదే ఓ మారు మద్రాసు మెయిల్‌కు మరో గూడ్సుబండికి ఒకే లైనుమీద రెండు స్టేషన్లమధ్య జరిగింది. నిజంగా.

గూడ్సు బండికి చాలా పెట్టెలుంటాయిగా. వెనక గార్డు పెట్టెలో బండిని ఆపే శక్తి సరీక్షించకుండా వదలటమనే పొరబాటు జరిగి పోయింది. అంటే ఒక్కమాటు కొంత వేగంతో బండిని వదిలాక దాన్ని ఆపేశక్తి డ్రైవరుకీ, గార్డుకీ లేదన్నమాట!

అసలు గూడ్సుబండి ఇవతల స్టేషన్లో ఆగి, రెండవ వైపునుంచి మెయిలు ఈ స్టేషనుకు వచ్చాక తను ఖాళీ లైనుమీద రెండవ స్టేషనుకు పోవాలి.

కాని ఎప్పుడైతే మొదటి స్టేషను వస్తున్నపుడు బ్రేకు వేసినాబండి ఆగలేదో గూడ్సు డ్రైవరూ, గార్డూ కూడా బిక్కచచ్చిపోయి తామూ ఇంకా ఇంజన్లో బొగ్గువేసే మనిషీ, ముగ్గురూ చనిపోవటం ఖాయమని నిర్ధారణకు వచ్చేశారు.

గూడ్సుబండి ఆగవల్సినప్పుడుకూడా ఆగకుండా రామబాణంలాగా పరుగెత్తి పోతున్నప్పుడు పాపం ఆ చిన్న స్టేషన్‌లోని సిబ్బందియావత్తూ అరుస్తూ గగ్గోలుగా ప్లాటుఫారం మీదకువచ్చి గుడ్లప్పగించి చూస్తూ నిలబడిపోయారు.

మృత్యువు మహా భయంకరంగా మనుష్య శక్తుల్నుంచి కట్టల్ని తెంచుకుని పరుగెడుతోంది.

గూడ్సు డ్రైవరు చేసేదిలేక — నిస్సహాయుడై వదలకుండా ప్రమాద సూచకంగా సైరను వేస్తూ పోతున్నాడు.

బళ్ళ రాకపోకల్ని కట్టడిచేసే అధికారిని "కంట్రోలరు" అంటారు: అతనుకూడా కాబిన్‌లోంచి టెలిఫోన్ను తలకేసి కొట్టుకుంటూ యింకొన్ని నిముషాల్లో జరగబోయే దారుణ ప్రమాదాన్ని తెలుసుకొని గగ్గోలు పడిపోతున్నాడు.

మహా భయంకరంగా అరుచుకుంటూ మృత్యువులా వినాశంవైపు ఆగకుండా పరుగెట్టే గూడ్సు బండికీ సరిగా ఎదురుగా యాభై మైళ్ళ వేగంతో, పిల్లలతో, పాపలతో, యువకులతో, వృద్ధులతో, ధనికులతో పేదలతో—రకరకాల మనుష్యులతో, వేలాది జీవాలతో ఎదో తమతమ

గమ్యస్థానాలకి సురక్షితంగా చేరుకుంటామనే ఆశలతో మహావేగంతో పరు, గెట్టుకొస్తున్న మద్రాసు మెయిలు.

ఈ రెంటికి ఎడం రెండు వందల గజాలు! ఇన్ని వేలమంది, ప్రయాణీకుల ఆయుస్సు రెండు వందల గజాలు! అంటే ఇక మూడు నాలుగు నిముషాలు.

కళ్ళు మూసుకుంటే, రెప్పపాటు కాలం గడిస్తే తుండాలు, మొండాలు; పచ్చినెత్తురు, బోర్లపడ్డ పెట్టెల క్రిందనుంచి హాహాకారాలు— అంతే!

మృత్యువు! ప్రళయం! భీభత్సం!

మెయిలు డ్రైవరు గురయ్య — నిశానీ గురయ్య — సిక్కా— వెయ్యి రూపాయల గురయ్య — రెండు వందల గజాల దూరంలో మహా భీకరంగా ప్రళయాన్ని సూచిస్తూ దిక్కులు దద్దరిల్లేలా అరుస్తూ వస్తూన్న బ్రహ్మ రాక్షసి కాలయముడ్ని చూశాడు,

రెండువేల ప్రాణాలను యిముడ్చుకున్న గుప్పెట్లో ఆ బొగ్గు మనిషి కూలి, ఆ పండితుడు రెగ్యులేటరును యావశ్చక్తి వినియోగించి నొక్కాడు. మెయిలు ఆగిపోయింది.

అంటే మృత్యువు యాభై గజాలూ, నలభై, మైళ్ళ వేగంతో అరుచుకుంటూ ముందుకు దూకింది. డ్రైవరు గురయ్య ఒక్కసారి ప్రేమతో స్పీడు మీటరును నలభైకి తిప్పి బండిని వెనక్కు నడపడం ఆరంభించాడు.

నలభై మైళ్ళ వేగంతో గూడ్సుబండి మెయిలును తరుముకొస్తోంది.

అదే వేగంలో మెయిలు బండి వెనక్కి పరుగెడుతూంది.

చావు బ్రతుకుల మధ్య దూరం ఒక్క నూటయాభై గజాలే సుమండీ!

ఒక్క నూటయాభై!

ఒహో! గురయ్యా — నీకు పెళ్ళాం, పిల్లలూ గుర్తు రావడం లేదయ్యా! రెగ్యులేటరు వదిలేసి బండిలోనుంచి దూకేసెయ్.

బ్రతికియుండిన సుఖములు బడయవచ్చు." చస్తే చస్తారు, జరిగే వినాశనం ఎలానూ జరుగుతుంది!

గురయ్య దీక్షగా ముందుకు చూస్తున్నాడు. బండియొక్క వేగం తగ్గలేదు, హెచ్చలేదు, రెగ్యులేటరుమీద చేయి కర్తవ్యాన్ని బోధిస్తోంది ....గురయ్యా! నువ్వు తుక్కు తుక్కయి కాలిపో కాని నీ చేయి ఈ రెగ్యులేటరునుంచి కదలదు. నువ్వు వట్టి బొగ్గుమనిషివి — కూలీవి — నువ్వు చస్తే దేశానికేం నష్టంలేదు.

కాని పాపం మెయిలులో ప్రయాణికులు బత్తాయితొనలు ఒలుచుకుని తింటున్నారు. హాయిగా పడుకుని పుస్తకాలూ, పత్రికలూ చదువుకుంటున్నారు. జేబుదొంగలు, ముష్టివాళ్ళు, పవిత్రులు అపవిత్రులు—అంతా కాలంలోవెనక్కి పరుగెడుతున్నారు. తల్లులు పిల్లల్ని హృదయాలకు హత్తుకుంటున్నారు.

కొంతమంది మళ్ళీ రైలువెనక్కి పరుగెట్టటం గమనించారు. కాని అర్థం కాలేదు.

గురయ్య చావుకీ బ్రతుక్కీ మధ్యగల నూటయాభై గజాలనుంచి ఒక్క అంగుళం మేర వదలలేదు. ఈ మహాసంగ్రామం ఒక్క అరగంట పాటు జరిగింది.

మద్రాసు మెయిలు రివ్వున బయలుదేరిన స్టేషను ప్లాట్‌ఫారం మీదకు వచ్చేసింది.

మహామృత్యువును గురయ్య జయించాడు.

గూడ్సుబండీ రొప్పుకుంటూ రెండవ లైను మీద నిల్చి పోయింది.

మెయిలు డ్రైవరు గురయ్య రెగ్యులేటరును తన బాహువుల్లో కావిలించుకుని యింజన్నుంచి దూకాడు.

గురయ్యను రైల్వేసిబ్బంది, ప్రయాణీకులూ, వంతులేసుకుని బుజాలమీద ఎక్కించుకుని ప్లాట్‌ఫారం అంతా పరుగులెట్టారు.

పిన్నలు, పాపలు, వృద్ధులు, స్త్రీలు, యువకులూ, అంతా మృత్యు గృహంలోంచి ఆనందంతో ఆ బొగ్గుమనిసి చొక్కా మనిషివైపు చూసారు.

గురయ్య పిచ్చిగా నవ్వేస్తున్నాడు.

ఆ ప్రయాణీకులు ఎన్ని తరాలు ఏం చేసి గురయ్య ఋణంతీర్చు కుంటారు?

ప్రభుత్వం గురయ్య ఋణం తీర్చుకుంది. యాభై రూపాయల కట్నం, ఒక సర్టిఫికెట్టు ముట్టింది. కాని గురయ్య ఒక లంకపుగాకు చుట్ట ఎక్కడన్నా దొరికితే బాగుండును అనుకున్నాడు. అదిమాత్రం ఎక్కడా లేదు.

---///---